క్లుప్తంగా

ప్రధాన రహదారి మరమ్మతు పనుల పరిశీలన



పెడన: పట్టణంలోని ప్రధాన రహదారి మరమ్మతు పనులను బుధవారం చేపట్టారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదేశాలతో రోడ్లు భవనాల శాఖాధికారులు పెడన గుడివాడ రోడ్డులోని శివాలయం ముందు నుంచి పెద్ద మసీదు వరకు, బంటుమిల్లి రోడ్డులో కొంత మేర రహదారులు దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేశారు. పనులను పుర పాలక సంఘ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, మెట్ల గోపీ ప్రసాద్, రహమతున్నీసా, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు వార్షిక కల్యాణోత్సవం

మోపిదేవి: మోపిదేవిలోని సకలేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం రాత్రి 8 గంటలకు వార్షిక కల్యాణోత్సవం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ సుధాకరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు పెండ్లి కుమారిని చేయడం, 2 గంటలకు గ్రామోత్సవం, 7 గంటలకు ఎదుర్కోలోత్సవం అనంతరం స్వామి వారి కల్యాణం ఘనంగా జరుగుతుందని తెలిపారు. గ్రామస్తులు, భక్తులు స్వామివారి కల్యాణంలో పాల్గొనాలని కోరారు.

మృతుడి కుటుంబానికి సాయం



కోడూరు: ఒకటో వార్డుకు చెందిన నాగం వాసు గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ. 10వేలను బుధవారం అందజేశారు. కోడూరు సర్పంచి వెన్నా షైనీ, ఎంపీటీసీ బడే గంగాధరరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చేతికి అందివస్తాడనుకున్న కొడుకు దూరమయ్యాడు

బందరులో ప్రమాదంతో చల్లపల్లిలో విషాదం

చల్లపల్లి: మచిలీపట్నంలో టిప్పర్ ప్రమాదంలో మృతి చెందిన ఎంసీఏ విద్యార్థి అద్దంకి గణేష్ స్వగ్రామం చల్లపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానిక రాజ్యలక్ష్మి హాస్పిటల్ రోడ్డులో అద్దె ఇంటిలో నివసిస్తున్న అద్దంకి లక్ష్మి కుమారుడు అద్దంకి గణేష్ కృష్ణా యూనివర్సిటీలో ఎంసీఏ చదువుతుండగా బుధవారం యూనివర్సిటీ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన గణేష్ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. గణేష్ తండ్రి భగవంతరావు మృతిచెందగా, గణేష్ అక్క అద్దంకి దుర్గాభవానీ కళాశాలలో ట్యూటర్‌గా పని చేస్తూ తల్లిని, తమ్ముడిని చూసుకుంది. రెండేళ్ల కిందట దుర్గాభవానీకి లక్ష్మీపురం గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా ఉద్యోగం రావడంతో తమ్ముడిని ఉన్నత విద్యావంతుడిని చేసేందుకు ఎంసీఏ చదివిస్తోంది. చదువు పూర్తయితే కొడుకు చేతికందివస్తాడని భావిస్తున్న తరుణంలో జరిగిన ఈ ప్రమాదం ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది.

'మధ్యాహ్న భోజనం' తనిఖీ

పామర్రు (పమిడిముక్కల): పమిడిముక్కల మండలం పెనుమత్స గ్రామంలోని శ్రీ దండమూడి వీరయ్య స్మారక ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం జెడ్పీటీసీ సభ్యురాలు, జెడ్పీ విద్యా వైద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నభోజనాన్ని విద్యార్థులతో కలిసి రుచి చూశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో కూడిన తాజా పదార్థాలతో వండిన ఆహారం విద్యార్థులకు ఇవ్వాలన్నారు. ఇష్టం వచ్చినట్లు వంటలు చేస్తే చర్యలు తీసుకుంటామని వంట ఏజెన్సీని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, ఎంపీటీసీ జురుషువరపు శృతి, వైఎస్సార్‌సీపీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, జురుషువరపు తిరుమలరావు పాల్గొన్నారు.

అందుబాటులోకి నేత్ర శస్త్ర చికిత్సలు

పెద్దాస్పత్రిలో నేడు నలుగురికి ఆపరేషన్లు

మచిలీపట్నంటౌన్: నగరంలోని జిల్లా సర్వజన ఆస్పత్రిలో కంటి శస్త్ర చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ కంటి వైద్యునిగా పనిచేసిన భాస్కరరెడ్డి నాలుగు నెలల కిందట గుడివాడకు బదిలీ కావడంతో శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శిక్షణ పొందిన ఐఓఎల్ సర్జన్ భానుమూర్తి ఇక్కడకు రావడంతో తిరిగి శస్త్ర చికిత్సలు ప్రారంభమయ్యాయి. బుధవారం నలుగురు రోగులకు కంటి శస్త్ర చికిత్సలు చేశారు.



కంటి శస్త్రచికిత్స అనంతరం రోగి వద్ద వైద్యులు, సిబ్బంది

ప్రతి బుధవారం ఆపరేషన్లు..

శస్త్ర చికిత్సలను బుధవారం ప్రారంభించిన ఆస్పత్రి రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ కోలా రామచంద్రరావు మాట్లాడుతూ కంటి సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇకపై మంచి వైద్యం అందిస్తామన్నారు. ఐఓఎల్ శస్త్ర చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు.

కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ప్రతి బుధవారం 15 నుంచి 20 మందికి చేస్తామన్నారు. 20 మంది కంటే ఎక్కువమంది ఉంటే వారంలో రెండు రోజులు కంటి శస్త్ర చికిత్సలు చేస్తామని తెలిపారు. కంటి ఆపరేషన్లు చేయడంలో భానుమూర్తికి మంచి నైపుణ్యం ఉందన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యం ఇవ్వండి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

కోనేరుసెంటర్: విశ్వవిద్యాలయంలో విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలే తప్ప వివక్షతకు కాదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. కృష్ణా యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యనే ఆయుధంగా మార్చుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రచించారన్నారు. విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు ప్రాధాన్యతను పక్కనపెట్టి ఇతర అనైతిక కేంద్రాలుగా మారే ప్రమాదాన్ని నివారించాలన్నారు. యూనివర్సిటీ ఏర్పడి 15 సంవత్సరాలు అయినప్పటికీ మౌలిక సదుపాయాల కొరత ఎదుర్కోవడం అత్యంత బాధాకరమన్నారు. విశ్వవిద్యాలయంలో ఎస్సీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని



మాట్లాడుతున్న మారుమూడి విక్టర్‌ప్రసాద్. చిత్రంలో వీసీ రామ్మోహనరావు తదితరులు

కోరారు. అనంతరం మారుమూడిని యూనివర్సిటీ తరఫున ఘనంగా సన్మానించారు. విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య రామ్మోహనరావు, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ సరస్వతి, బందరు డీఎస్పీ మాసూంబాషా, బందరు తహసీల్దార్ డి. సునీల్‌బాబు, సహాయ ఆచార్యులు సీతాలు, సురేష్, మత్తే నాగరాజు, రాంబాబు, రవీంద్ర, త్రిలోక్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సృజనాత్మక ప్రాజెక్టులు



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులతో ఉపాధ్యాయులు



ఓపెన్ డ్రైయినేజీ ప్రాజెక్టు వివరాలు తెలుపుతున్న విద్యార్థిని

మచిలీపట్నంటౌన్: నగరంలోని చిలకలపూడి పాండురంగ నగర పాలక ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు బుధవారం తయారుచేసిన సృజనాత్మక ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఎంటర్‌పెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఈఎండీపీ), ఎస్‌సీఈఆర్‌టీ, ఎస్ఎస్ఏ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్‌లో వ్యవస్థాపక మనస్తత్వ నైపుణ్య కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన విద్యార్థులు వేస్ట్ ప్లాస్టిక్ బాటిల్స్‌ను ఉపయోగించి పూలకుండీలు తయారుచేయటం, ఓపెన్ మురికినీటి పారుదల వ్యవస్థ ద్వారా దోమల నివారణ, ఓపెన్ డ్రెయినేజీలపై హైడ్రాలిక్ డోర్‌ల ఏర్పాటు వంటి సృజనాత్మక ప్రాజెక్టులను తయారుచేశారు. అలాగే పరిశ్రమల ద్వారా వచ్చే వ్యర్థాల ప్రభావాన్ని తగ్గించేందుకు రీ-సైక్లింగ్ చేయడం వంటి ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. మార్చి నెలలో జరుగనున్న ఈఎండీపీ ఎక్స్‌పోలో ఈ ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని ఈఎండీపీ జిల్లా మేనేజర్ జె. భానుకిరణ్ తెలిపారు. మంచి ప్రాజెక్టులు తయారు చేయాలని సూచించారు. ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థుల ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర రిపోర్ట్‌ను డీవైఈఓ యూవీ సుబ్బారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని వీవీవీ కనకదుర్గ, ఈఎండీపీ ఫెసిలిటేటర్స్ సీహెచ్ భార్గవిరాణి, ఎస్. ఉషాకిరణ్, వి. వాణి, ఎండీ ఇబాదతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా చల్లపల్లి మండల పరిషత్ సమావేశం

- షాపింగ్ కాంప్లెక్స్ అంశంపై చర్చ
- కోర్టు ఆదేశాల ప్రకారం నోటీసులిచ్చామన్న ఎంపీడీఓ

చల్లపల్లి: చల్లపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. బుధవారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ కోట విజయ రాధిక అధ్యక్షతన నిర్వహించారు. లక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్ చల్లపల్లిలోని రాజీవ్‌గాంధీ మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్ అద్దెల వ్యవహారం చర్చకు తెచ్చారు. ఇటీవల అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి కాంప్లెక్స్ అద్దెల వ్యవహారంపై చర్చించిన ఎంపీపీ, ఎంపీడీఓ తదుపరి రెండు సాధారణ సమావేశాల్లో ఈ అంశాన్ని ఎందుకు పొందుపర్చలేదని ప్రశ్నించారు. షాపుల వారికి ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చే ముందు కనీస సమాచారాన్ని పాలకవర్గానికి ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందా లేదా అని ప్రశ్నించారు. సమావేశ అజెండాలో కూడా కాంప్లెక్స్ అంశం చేర్చి అత్యవసర సమావేశం తదుపరి పరిణామాలు సభ్యులకు వివరించాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీఓ కేవీ సుబ్బారావు స్పందిస్తూ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలు అద్దెకు తీసుకుని వ్యాపారాలు చేస్తున్న వారు



షాపింగ్ కాంప్లెక్స్ అంశంపై మాట్లాడుతున్న ఎంపీటీసీ ద్వారకానాథ్

గతంలో కనీసం లీజు అగ్రిమెంట్, ఆక్షన్ లేకుండా నామమాత్రపు అద్దెతో కొనసాగుతున్నట్లు కార్యాలయ రికార్డుల ద్వారా గుర్తించామని తెలిపారు. 2016లో కేవలం కార్యాలయ నోట్ ఫైల్ రూపంలో మూడేళ్ల కాల పరిమితి పెంచినట్లు ఉందన్నారు. ఈ నేపథ్యంలో కొందరు కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో కోర్టు ఆదేశాల ప్రకారం షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించాల్సి ఉన్న నేపథ్యంలో నెల రోజుల్లో ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చామని ఎంపీడీఓ తెలిపారు. మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు పలు సమస్యలు ప్రస్తావించి పరిష్కారం కోరారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

తొమ్మిది నెలలకు చింతలమడ వాసులు గుర్తొచ్చారా?

- అవాస్తవాలు మాట్లాడిన బుద్ధప్రసాద్
- ఎమ్మెల్యే రమేష్‌బాబు వెంటనే స్పందించి ఆదుకున్నారు
- వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ నాయకుడు ద్వారకానాథ్

చల్లపల్లి: చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు చింతలమడ దళితవాడకు వెళ్లి మాజీ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అవాస్తవాలు మాట్లాడారని వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ నాయకుడు మోపిదేవి ద్వారకానాథ్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడారు. తొమ్మిది నెలల కిందట చింతలమడ వాసులు మోపిదేవి పెళ్లికి వెళుతుండగా కాసానగర్ వద్ద రోడ్డు ప్రమాదం జరుగగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు వెంటనే స్పందించి పోలీసులు, డాక్టర్లు, ఇతర అధికారులను అప్రమత్తం చేశారని, ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందేలా శ్రద్ధ చూపారని గుర్తుచేశారు. మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారని తెలిపారు. అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం వేగవంతం చేసేందుకు మచిలీపట్నం నుంచి తన కారులో ఇద్దరు డాక్టర్లను అవనిగడ్డ తీసుకువచ్చి పోస్టుమార్టం దగ్గరుండి పర్యవేక్షించారని గుర్తుచేశారు. మృతుల అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు చొప్పున వారి కుటుంబాలకు అందజేసి మానవత్వం చూపారన్నారు. మృతుల్లో ఇద్దరికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.5 లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారని తెలిపారు. మిగిలిన వారికి ప్రభుత్వ సహాయం అందించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. ఇవేమీ తెలియని బుద్ధప్రసాద్ తొమ్మిది నెలలకు చింతలమడ వచ్చి రాజకీయ హడావుడి చేయడం హాస్యాస్పదమన్నారు. మూడేళ్లుగా ప్రజల మధ్య లేకుండా, ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్రామాల్లోకి వెళ్లి టీడీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారం ప్రజలు నమ్మరని అన్నారు.

బీసీ జనభేరి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

బంటుమిల్లి: ఆంధ్రప్రదేశ్ బీసీ సేన ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన మంగళగిరిలో నిర్వహించనున్న బీసీ జనభేరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. బీసీల హక్కుల సాధనకు సంస్థ చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. బీసీ సేన పెడన నియోజకవర్గ కన్వీనర్ ఎస్‌కే షహనాజ్‌బేగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు



కృత్తివెన్ను: కృత్తివెన్ను గుడిదిబ్బలో జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాల సమయంలో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామని ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఆలయ చైర్మన్ నాగేశ్వరరావుతో కలిసి దుకాణాల ఏర్పాటు, పార్కింగ్ ప్రదేశం తదితర ప్రాంతాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈనెల 18, 19, 20 తేదీలలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. 216 జాతీయ రహదారి నుంచి దేవస్థానం వరకు వచ్చే వాహనాలకు ఎదురుగా మరో వాహనం వెళ్లకుండా వన్‌వే ఇస్తున్నామని చెప్పారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు భక్తులు, స్థానికులు సహకరించాలని కోరారు.

రేపు సీనియర్ రెసిడెంట్ పోస్టుకు ఇంటర్వ్యూ

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ అసిస్టెంట్ పోస్టుకు శుక్రవారం ఇంటర్వ్యూ నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ కె. విజయకుమారి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రభుత్వాస్పత్రిలో ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 80748 58998, 99595 93023 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చొరవ చూపాలి

ఎంపీపీ మధుసూదనరావు

గూడూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల వరకు చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన జరిగింది. వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని చెప్పారు. పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరుకాని అధికారుల నుంచి సంజాయిషీ తీసుకోవాలని ఎంపీడీఓ డి.సుబ్బారావును ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.



పీఆర్ ఏఈని వివరాలు అడుగుతున్న ఎంపీపీ మధుసూదనరావు

వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కప్పలదొడ్డి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోకపోవడం లేదంటూ జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు ఎంఈఓ సీహెచ్ సత్యసాయిబాబుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, తహసీల్దార్ బీవీ ప్రసాద్, ఎంపీడీఓ డి.సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, కారుమంచి కామేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్ గిడ్డంగి, కార్యాలయ భవనం ప్రారంభం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ గిడ్డంగి, కార్యాలయ భవనం ప్రారంభోత్సవం గురువారం ఉదయం 11.20 గంటలకు జరుగుతుందని సొసైటీ కార్యదర్శి తోట సాయి రామానుజ అఖిల్ బుధవారం తెలిపారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ అరజా లక్ష్మీతులసి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, మంత్రులు ఆర్‌కే రోజా, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జోగి రమేష్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని చెప్పారు.

కోసూరువారిపాలెంలో.....

నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, మల్టీపర్పస్ గోడౌన్, పెదకళ్లేపల్లిలో సీసీ రోడ్డును గురువారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రారంభిస్తారని సర్పంచ్ కోసూరు అనూష తెలిపారు. అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దుర్గా నాగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణ కాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శంకరమంచి భాస్కర విజయకుమార్ బ్రహ్మత్వంలో స్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. దేవదాయ శాఖ తరఫున ఆలయ అధికారులు గుమ్మడి వెంకటేశ్వరరావు, వెంకటరమణ, కె. రమావాణి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు, హోమాలు, రాత్రి 10 గంటలకు రాజాధిరాజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ అధికారులు

కౌన్సిల్ సమావేశం నేటికి వాయిదా



షాహిదాబేగం మృతికి మౌనం పాటించి సంతాపం తెలుపుతున్న కౌన్సిల్ సభ్యులు

మాజీ కౌన్సిలర్ షాహిదా బేగం మృతికి సంతాపం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం గురువారానికి వాయిదా పడింది. మాజీ కౌన్సిలర్ షాహిదాబేగం గత నెల 21వ తేదీన మృతి చెందారు. ఆమె మృతికి సంతాపంగా కౌన్సిల్ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించి సమావేశాన్ని వాయిదా వేశారు. ఇన్‌చార్జ్ మేయర్‌గా డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత సభకు అధ్యక్షత వహించారు. షాహిదాబేగం 1994, 2000లో మునిసిపల్ పాలకవర్గాల్లో కౌన్సిలర్‌గా పని చేశారన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు, రాష్ట్ర స్థాయి మహిళా సభ్యురాలిగా పనిచేశారన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కౌన్సిల్ సభ్యులు ఆకాంక్షించారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్లు మీర్‌అస్గర్‌అలీ, మేకల సుబ్బన్న, షేక్ షాహీనా, చిటికిన వెంకటేశ్వరమ్మ, పరింకాయల విజయ్, జోగి చిరంజీవి, వల్లి శేఖర్, ఐనం తాతారావు, టీడీపీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మచిలీపట్నంటౌన్: భాస్కరపురం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎం. భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని భాస్కరపురం, బచ్చుపేట, రామానాయుడు పేట, రైలుపేట, ఇంగ్లీషుపాలెం, సుకర్లాబాద్, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

పెడన: హజరత్ మౌలా ఆలీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఉరివి పంచాయతీ శివారు గాయంపాడులో ఉరుసు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం రాత్రి దర్గా అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జెండా ఊరేగింపు (సందల్), దీపారాధన, మిలాద్ కార్యక్రమాలు వైభవంగా జరిపారు. కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ హుస్సేన్, కార్యదర్శి దాదా, జాయింట్ కార్యదర్శి బగ్బుల్‌హుస్సేన్, కోశాధికారి రహమాన్ బేగ్ తదితరులు పర్యవేక్షించారు.

దళితుల అభ్యున్నతే ధ్యేయం

- ఎమ్మెల్యే కొడాలి నాని
- ఎస్సీలు డ్రైవర్లు, క్లీనర్లుగానే కాదు యజమానులను చేయాలన్నదే లక్ష్యం
- ఐదు ఆర్టీసీ అద్దె బస్సుల ప్రారంభం

గుడివాడటౌన్: రాష్ట్రంలోని దళితులు ఆర్థికంగా ఎదిగి స్థిరపడాలనేదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి లక్ష్యమని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం రాత్రి కొత్తగా ఆర్టీసీ లీజుకు తీసుకున్న 5 బస్సులను ఆయన ప్రారంభించారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ (జాతీయ షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సబ్సిడీతో ఒక్కొక్కరికి రూ.50 లక్షల యూనిట్ విలువతో ఐదు బస్సులను ఎస్సీలకు మంజూరు చేశారు. నూతన బస్సును ఆయన బస్టాండ్ నుండి నెహ్రూచౌక్ వరకు నడిపారు. ఆయన మాట్లాడుతూ దళితులను ఆర్థికంగా స్థిరపర్చేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని అందులో భాగంగా దళితులు కేవలం డ్రైవర్లు, క్లీనర్లుగానే మిగిలిపోకుండా వారిని కూడా వాహన యజమానులుగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి 25 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 45 శాతం సబ్సిడీలు ఇస్తూ మిగిలిన మొత్తాలను బ్యాంకు రుణాల ద్వారా పూర్తి పెట్టుబడి ప్రభుత్వం నుంచి అందే ఏర్పాటు చేసి భారీ వాహనాలను అందించి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం వలన వారు ఆర్థికంగా స్థిరపడే ఏర్పాటు చేస్తుందన్నారు. అందులో భాగంగా నియోజకవర్గానికి చెందిన ముగ్గురు దళితులతో 5 బస్సులు ఇవ్వడం జరిగిందని అవి బంటుమిల్లి, కైకలూరు సర్వీసులకు వినియోగిస్తారన్నారు. ఒక రూట్‌లో 280 కిలోమీటర్లు, మరో రూట్‌లో 320 కిలోమీటర్లు సర్వీసులు నడుపుతాయన్నారు. తద్వారా వీరికి స్వయం ఉపాధి కలుగుతుందని ఈ విధమైన అనేక కార్యక్రమాలు లారీలు, టాక్సీకి కార్లు, ఇతర వాహనాలను కూడా ఇస్తున్నందున అర్హులైన వారు వీటిని అందిపుచ్చుకుని ఆర్థికంగా స్థిరపడాలని ఆయన కోరారు. ఆర్టీసీ మేనేజర్ జి రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.